క్లుప్తంగా

ఉచిత వైద్యం, విద్య దూరం చేయడం దారుణం



కర్రి గౌరీ సుభాషిణి

పెనుమంట్ర: రాష్ట్రంలో పేదవాడికి ఉచిత వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొచ్చి, ఐదు కళాశాలలను పూర్తి చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిల్లో పది కళాశాలలను ప్రైవేటుపరం చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాష్ట్రానికి తీసుకురాలేకపోయారని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచక, రద్దుల పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

కొతాలపర్రులో గజేంద్ర మోక్షం



కొతాలపర్రులో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కొతాలపర్రులోని స్వయంభుః కేశవస్వామి ఆలయంలో ఆదివారం గజేంద్ర మోక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయంనుంచి కేశవ స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, అనంతరం అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం గజేంద్ర మోక్షం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌కేకు జాషువా శత జయంతి అవార్డు



జాషువా శత జయంతి అవార్డు అందుకుంటున్న ఎన్‌కే నాగేశ్వరరావు

పెనుగొండ: ప్రముఖ కవి, రచయిత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎన్‌కే నాగేశ్వరరావు మహాకవి గుర్రం జాషువా శత జయంతి అవార్డు అందుకున్నారు. పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం భీమవరం ప్రధాన గ్రంథాలయ వేదికపై నిర్వహించిన రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉషోదయ ఫౌండేషన్ అవార్డును అందించినట్లు తెలిపారు. ఐదు వసంతాలుగా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలకు గానూ అవార్డును అందించారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ ధనాని ఉషారాణి, యువీ రత్నం తదితరులు పాల్గొన్నారని వివరించారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

పెనుగొండ: మండలంలోని ఇలపర్రు వ్యవసాయ సహకార పరపతి సంఘ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం సొసైటీ వద్ద చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులుగా చేకూరి నరసింహ రాజు,నల్లి త్రిమూర్తులుతో సొసైటీ సబ్ డివిజనల్ అధికారి కేవీ రాజ్యలక్ష్మీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మజీ, గుత్తుల లోకేశ్వరరావు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి గురుబ్రహ్మ అవార్డు



గురుబ్రహ్మ అవార్డు అందుకుంటున్న రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఆ సంస్థ కార్య నిర్వాహక సభ్యులు, విజయవాడ నగర ప్రముఖుల చేతులమీదగా రాజరాజేశ్వరి ఈ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలోనూ, విద్యారంగంలోనూ విశేషంగా కృషిచేసిన వారికి ప్రతి సంవత్సరం గురుబ్రహ్మ అవార్డుతో సత్కరిస్తుంటామని మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వహకులు తెలియజేశారు. అవార్డు అందుకున్న రాజరాజేశ్వరిని కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సెక్రటరీ వీరరాఘవయ్య, కళా శాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అభినందించారు.

మత్స్యకారులకు వరద కష్టాలు



గోదావరి తీరంలో నాటు పడవలకు లంగరు వేసిన దృశ్యం



పడవలరేవు వద్ద వలకట్లు కట్టే ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- 15 రోజులుగా సంప్రదాయ వేటకు విరామం
- వరద నీటితో ఉప్పొంగుతున్న వశిష్ట గోదావరి
- ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు

నరసాపురం: గత 15రోజులుగా వరదనీటి ప్రవాహ ఉధృతితో వశిష్ట గోదావరి ఉరకలు వేస్తుంది. గోదావరి వరద ప్రభావం నాటు పడవలపై వేట సాగించే సంప్రదాయ మత్స్యకారులపై పడింది. 15 రోజులుగా వేటకు విరామం చెప్పి ఉపాధి లేక గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు, గోదావరి వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో గోదావరిలో వేట సాగడంలేదు. దీంతో గోదావరిలో వేట సాగించే నాటు పడవులను తీరానికి తీసుకొచ్చి మత్స్యకారులు లంగరు వేశారు. గత 15 రోజులుగా గోదావరిలో వేట సాగడంలేదు. ఇప్పుడిప్పుడే గోదావరి నీటిమట్టం తగ్గడం ప్రారంభమైనాకూడా మరో రెండు, మూడురోజులపాటు గోదావరిలో నాటు పడవలపై వేట సాగే అవకాశం లేదు. సెప్టెంబర్ నెల అంటేనే గోదావరిలో చేపలు ఎక్కువగా లభించే సీజన్. అయితే ఈ రోజుల్లో వేట సాగకపోవడం మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో అల్పపీడనాలు ఎక్కువ సంఖ్యలో పట్టే అవకాశం ఉందని వాతావరణశాఖశాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో నాటుపడవలపై వేట సాగించే మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

వరదలొస్తే సంప్రదాయ వేటపైనే ప్రభావం

సముద్రంలో పెద్ద పెద్ద మెకనైజ్ బోట్లపై వేట సాగుతుంది. తుఫాన్‌లు సమయంలో తప్పితే, ఇలాంటి అధిక వర్షాలు, వరదల ప్రభావం సముద్రంలో సాగే వేటపై ఉండదు. అయితే ఉమ్మడి పశ్చిమజిల్లాలో 19 కిలోమీటర్లమేర తీరప్రాంతం ఉన్న నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చెక్క నావలపై గోదావరిలో వేట సాగించే మత్స్యకారులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. నరసాపురం పట్టణాన్ని ఆనుకుని ఉన్న గోదావరిలో సుమారు 500 కుటుంబాల మత్స్యకారులు చెక్క బోట్లపై సంప్రదాయ వేట సాగిస్తారు. గోదావరిలో దొరికే మత్స్యసంపద ఎక్కువగా లోకల్ మార్కెట్‌లో విక్రయాలు జరుగుతాయి. కొన్ని రకాల చేపలు మాత్రమే పై ప్రాంతాలకు ఎగుమతులు అవుతుంటాయి. మత్స్యకారుల్లో అత్యంత నిరుపేదలు ఇప్పటికీ ఇలా గోదావరిలో సంప్రదాయ వేట సాగిస్తుంటారు. గోదావరి వరత ప్రవాహ ప్రభావం పూర్తిగా వీరిపై పడింది. రానున్న రోజుల్లోనైనా వేట సజావుగా సాగేలా చూడాలని గోదావరి తల్లిని మత్స్యకారులు వేడుకుంటున్నారు.

15 రోజులుగా ఇంతే



నేను చెక్క నావపై గోదావరిలో వేటసాగిస్తాను. మనకంటే పెద్దగా వర్షాలులేవు గానీ, పై ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో గోదావరి పొంగి ప్రవహిస్తోంది. గోదావరి వరద భయపెడుతుంది. గోదావరి ఉధృతంగా ఉంది. దీంతో గోదావరిలో వల వేయడం కష్టంగా ఉంది. ఇలాంటి సమయంలో వలలు నీటిలో వదిలితే పాడైపోతాయి. నష్టం జరుగుతుంది. అందుకే 15రోజుల నుంచి వేట చేయడం లేదు.

– మైల వీరాస్వామి, నరసాపురం

మరో వారం కష్టమే



మరోవారం రోజుల పాటు గోదావరిలో వేట సాగించడం కష్టం అని చెబుతున్నారు. గోదావరి సముద్రంలో ఇక్కడే కలుస్తుంది కాబట్టి ఎగువ నుంచి వచ్చే నీరంతా ఇక్కడికే రావాలి. వరద నీరు రాక కాస్త తగ్గినా ఇక్కడ గోదావరిలో వరద తగ్గడానికి మరికొన్ని రోజులు పడుతుంది. కాబట్టి మరికొన్ని రోజులు గోదావరిలో వేట సాగదు. ఈ సీజన్‌లో అసలు పులసలు వలలకు చిక్కనే లేదు.

– కొల్లు రాంబాబు, నరసాపురం

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలి



కామన బుజ్జి

నరసాపురం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. ఎరువుల కొరతతో అన్నదాతలు రోడ్డునపడ్డారన్నారు. ఓ వైపు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో మేదర్ల వంతెన వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించి, వినతిపత్రం ఇస్తామని స్పష్టం చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగంగా చేపట్టిన ఆందోళనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10:30 గంటలు నుంచి అందించాలని కోరారు.

కందరవల్లి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామకం



కందరవల్లి గ్రామ కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: ఆచంట మండలం కందరవల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా యర్రగొప్పుల లక్ష్మణరావును నియమించినట్లు మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు, నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ప్రజా ప్రతినిధులను, నాయకులను కక్షసాధింపు చర్యలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, ముత్యాల నాగేశ్వరరావు, రావి నాగరాజు, రావి వరప్రసాద్, గంధం సూర్యనారాయణ, పెడతట్ల వెంకటేశ్వరరావు, బోడపాటి రంగారావు, సుంకర త్రిమూర్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు రాజ్‌కుమార్ మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు, మాల మహానాడు జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్ ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య కుమారుడు ఉన్నారు. చిల్లే మృతికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పార్టీ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, రుద్ర ప్రసాద్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక మాఫియాపై శాసన మండలిలో ప్రస్తావించాలి



ఎమ్మెల్సీ వంక రవీంద్రకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగొండ: ఆచంటలో అక్రమంగా జరుగుతున్న ఇసుక దందాపై శాసనమండలిలో ప్రస్తావించి, ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, గుబ్బల వీర బ్రహ్మం కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సీఆర్‌జెడ్ పరిధిలో ఇసుక తవ్వకాలకు నిషేధం ఉన్నప్పటికీ నియోజకవర్గానికి చెందిన రాంబాబు, ముఖ్య నాయకులతో కలిసి అక్రమంగా తవ్వేశారని ఆరోపించారు. అక్రమ నిల్వలు పెట్టి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నార న్నారు. తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా సమస్యను లేవనెత్తాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కల కిరణ్‌కుమార్, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నిమజ్జనోత్సవాలు



పెనుమంట్ర: వెలగలవారిపాలెంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండ: కరుగోరుమిల్లిలో రూ.1.45లక్షలకు వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తులు

పెనుమంట్ర: మండలంలో శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం చివరి రోజు శ్రీ గణనాథుని నిమజ్జోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వెలగలవారి పాలెం గ్రామంలో రామాలయం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతిని ప్రత్యేక రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి సమర్పించిన 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా పెద్దమ్మ తల్లి అనే భక్తురాలు రూ.55 వేలకు దక్కించుకున్నారు. అనంతరం గణపతి ప్రతిమను గోస్తిని పంట కాలువలో నిమజ్జనం చేశారు.

రూ.1.45 లక్షలు పలికిన లడ్డూ

పెనుగొండ: చవితి లడ్డూకు గ్రామీణ ప్రాంతాల్లోనూ క్రేజ్ తగ్గడం లేదు. ఆచంట మండలం కరుగోరుమిల్లి ముత్యాల వారి పాలెంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన వేలం పోటాపోటీగా సాగింది. వేలంలో ముత్యాల సత్యనారాయణ, మాసేనమ్మల కుమారులు లడ్డూను రూ.1,45,008 కు దక్కించుకున్నారు. శ్రీభక్తాంజనేయ కోదండ రామాలయంలో నిర్వహించిన 13వ నవరాత్రి వేడుకల్లో భాగంగా నిమజ్జనోత్సవం నిర్వహించిన అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు.

ఎరువుల విక్రయ కేంద్రం ఆకస్మిక తనిఖీ



జుత్తిగ సొసైటీ ఆవరణలో రైతులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుమంట్ర: ఎరువులు, పురుగుమందులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన జుత్తిగ వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఖరీఫ్ లో రైతుల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత విక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎరువులు కొరత లేదని యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ పంట నమోదు పనులను అధికారులు వేగవంతం చేయాలని, ప్రతి రైతు వివరాలు నమోదు చేయాలని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ దాసిరాజు, మార్టేరు వ్యవసాయ సంచాలకులు ఎంవీ రమేష్, తహసీల్దార్ వైవీ రవికుమార్ వ్యవసాయ శాఖ క్వాలిటి కంట్రోలర్ వై.రాఘవేంద్రరావు, మండల వ్యవసాయ అధికారి దేవి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



పెనుగొండ వాసవీ శాంతి ధాంలో వివరాలను వెల్లడిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెనుగొండ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ సన్మాన్–2025 అవార్డులు అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బొండాడ రాంపండు తెలిపారు. ఆదివారం పెనుగొండలోని వాసవీ శాంతి ధాంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యలోనూ, క్రీడల్లోనూ ఆర్యవైశ్య యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజు, ట్రస్ట్ నిర్ణయించినట్లు వివరించారు. 10వ తరగతి, 12వ తరగతిల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, డిగ్రీ, పీజీల్లో డిస్టింక్షన్ , అంతకంటే ఎక్కువ మార్కులు, పీహెచ్‌డీ, డాక్టరేట్‌లు సాధించిన వారికి, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా గౌరవాలు సాధించిన వారికి అవార్డులు ఇస్తామన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు పూర్తి చేసి, ఆర్యవైశ్య కమ్యూనిటీ ప్రూఫ్‌తో పాటు జిరాక్స్ కాపీలతో సెప్టెంబరు 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కానీ, క్యూఆర్ కోడ్‌తోగానీ, నేరుగా పెనుగొండ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలన్నారు. ఎంపికైన విద్యార్థులతో పెనుగొండలో 28న గ్రామోత్సవం నిర్వహించి, 11 గంటలకు వాసవీ శాంతి ధాంలో నగదు బహుమతులతో సత్కరిస్తామన్నారు. మిగిలిన వివరాలకు 99120 18818, 08819–246252 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో ట్రస్ట్ కార్యదర్శి కేఎస్‌వీ రాజా, సభ్యులు కోట్ల సూరిబాబు, కోట్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన డంపింగ్ యార్డు పొగ

వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు



యడ్లబజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ



పెనుమదం రోడ్డులో పొగతో వాహనదారుల ఇబ్బందులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు నుంచి పొగ అత్యంత ప్రమాదకరంగా వస్తుంది. ఈ పొగ పీలిస్తే అనేక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. యడ్ల బజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డులో అంటుకున్న మంటలతో గత మూడు రోజులుగా వస్తున్న పొగ రోడ్డుపై కమ్మేస్తుంది. వేసవికాలమైతే వేడికి చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వంటి విషపూరితమైన రసాయనాలు అంటుకుని లేదా ఎవరైనా ఆకతాయిలు అంటించి ఉన్నా ఇలా పొగ వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కానీ వర్షాకాలం కూడా ఇలా పొగ వ్యాపించడంతో యడ్లబజారు సెంటర్ నుంచి పెనుమదం వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు అలాగే శంభునిపేట, బంగారు వారి చెరువుగట్టు, యడ్లబజారు సెంటర్ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు పొగ ఇళ్లల్లోకి వచ్చేస్తుందని భయాందోళనలకు గురవుతున్నారు.

అనారోగ్య సమస్యల భయం

గతంలో రామయ్యహాలు వద్ద ఉన్న డంపింగ్ యార్డు నుంచి వచ్చిన పొగ వల్ల స్థానిక ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులతో ఆసుపత్రి పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆస్మాతో బాధపడే వారు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. రామయ్యహాలు పక్కన ఉన్న సూర్యతేజస్ నగర్ ప్రజల్లో కొందరు ఎంతో ఆనందంగా ఇళ్లు కట్టుకుని ఈ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగను భరించలేక ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు అంటుకుంటే అంత త్వరగా నిప్పు ఆరే అవకాశం ఉండదు. అంతే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు మెడికల్ వ్యర్థాలు కూడా ఉండడంతో పొగ పీల్చడం వల్ల అధికంగా అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా స్థానిక యడ్లబజారు సెంటర్ నందు వ్యాపారస్తులు, కనకదుర్గమ్మ, పంచముఖ ఆంజనేయ స్వామి, అయ్యప్పస్వామి ఆలయాలు, వెటర్నరీ ఆసుపత్రిలకు వచ్చే కస్టమర్లు, భక్తులు, జంతు ప్రేమికులు ఇలా ఈ సెంటర్లో అనేక మంది వస్తుంటారు. గత మూడు రోజులుగా ఈ పరిస్థితి చూసి కనీసం వ్యాపార సంస్థల వద్ద పది నిమిషాలు కూడా నిలబడలేకపోతున్నారని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఈ పొగను అదుపులోకి తీసుకురాకపోతే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పొగ సమస్యను మునిసిపల్ అధికారులు వేగంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

పశువుల ఆస్పత్రి మొత్తం పొగే



ఇంట్లో పెంచుకునే కుక్కకు వ్యాక్సిన్ వేయించడానికి వెటర్నరీ ఆసుపత్రికి వచ్చాను. రోడ్డుపై నుంచి వెటర్నరీ ఆసుపత్రిలోకి కూడా పొగ కమ్మేసి ఉంది. వ్యాక్సిన్ వేయడానికి కూడా వెటర్నరీ సిబ్బంది ఇబ్బందులు పడే పరిస్థితి కనిపించింది. పది నిమిషాలు ఇక్కడ ఉండలేకపోయాం. ఇందులో పనిచేసే సిబ్బంది, ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు పరిస్థితైతే మరీ దారుణంగా కనిపించింది.

– కాటంరెడ్డి దొరబాబు, ఉల్లంపర్రు

పొగ భరించలేకపోతున్నాం



నేను ఐరన్ వర్క్ చేస్తాను. పొగ వస్తున్నప్పుడు మా పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఏరోజుకారోజు పనిచేసుకోవాలి. డంపింగ్ యార్డు నుంచి పొగ వస్తున్న సమయంలో స్థానికంగా ఇక్కడ నిలబడలేకపోతున్నాము. వ్యాపారం పోతుందని ఇక్కడే ఉంటే ప్రాణాలే పోయే పరిస్థితి కనిపిస్తుంది. దీనికి అధికారులు ప్రత్యేక నిర్మూలనా ఏర్పాట్లు చేయకపోతే అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలు అవుతాం.

– కుంపట్ల రమేష్, వెల్డింగ్ వర్క్స్, పాలకొల్లు